

బతుకమ్మను తీసుకువస్తున్న యువతి



సిరిసిల్లలోని బతుకమ్మఘాట్ వద్ద ఆడుతున్న మహిళలు

రామ రామ ఉయ్యాలో...

జిల్లాలో బతుకమ్మ వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. బుధవారం ఎంగిలిపూల బతుకమ్మ వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా మహిళలు తీరొక్క పూలతో రంగు రంగుల బతుకమ్మలు పేర్చారు. తంగేడు, గునుగ, పట్టికుచ్చు పూలతో అందంగా తీర్చిదిద్ది ప్రధాన కూడళ్లలో ఉంచి రామ రామ ఉయ్యాలో అంటూ ఆడిపాడారు. అనంతరం మానేరు నదీ తీరం, సమీప వనరుల్లో వాటిని నిమజ్జనం చేశారు.

– న్యూస్‌టుడే, సిరిసిల్ల (విద్యానగర్)



రాజన్న ఆలయం వద్ద...



బతుకమ్మతో యువతి



సుభాష్‌నగర్‌లో...



సిరిసిల్ల విద్యానగర్‌లో..

పకడ్బందీగా డిజిటల్ కార్డులు

సన్నాహక సర్వేకు రంగం సిద్ధం



ఈనాడు, కరీంనగర్

కుటుంబ డిజిటల్ కార్డుల జారీకి రంగం సిద్ధమైంది.. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ఇంటిల్లిపాది సమాచారాన్ని ఒకేచోట క్రోడీకరించే ప్రక్రియకు శ్రీకారం చుట్టింది. గురువారం నుంచి ఉమ్మడి జిల్లాలోని ఎంపిక చేసిన పల్లెలు, వార్డులకు అధికారులు, సిబ్బంది వెళ్లి కుటుంబంలోని మహిళ పేరుతో జారీ చేసే కొత్త డిజిటల్ కార్డుకు అవసరమైన సమాచారాన్ని సేకరించనున్నారు. ఇప్పటికే రాష్ట్రస్థాయి అధికారులు అందించిన మార్గదర్శకాల ప్రకారం నాలుగు జిల్లాల పరిధిలోని 12 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 24 ప్రదేశాల్ని ఎంపిక చేశారు. నియోజకవర్గ కేంద్రంలోని ఒక వార్డుతోపాటు ఆ నియోజకవర్గ పరిధిలోని ఒక గ్రామాన్ని సన్నాహక సర్వే (పైలట్ ప్రాజెక్ట్)కు ఎంచుకున్నారు. ఈ నెల 7వ తేదీ వరకు రోజూ నివాస గృహాల వారీగా పూర్తిస్థాయి వివరాలు తెలుసుకోనున్నారు. నియోజకవర్గానికి ఆర్డీవో లేదా జిల్లాస్థాయి ఉన్నతాధికారిని నోడల్ అధికారిగా నియమించారు. వీరి పర్యవేక్షణలో ప్రతి గ్రామానికి బృంద నాయకుడిగా ఎంపీడీవో, సభ్యులుగా ఇతర అధికారులు, కంప్యూటర్ ఆపరేటర్ల సేవల్ని వినియోగించుకునే ఏర్పాట్లు చేశారు.

ప్రక్రియ తీరిలా..!

- ఉమ్మడి జిల్లాలో 5,359 ఇళ్లకు సన్నాహక సర్వేలో భాగంగా ఈ డిజిటల్ కార్డుని అందించనున్నారు. ఈ కుటుంబాల్లో ఉన్న సుమారు 16వేల మందికి పైగా సభ్యుల పూర్తి వివరాలు తెలుసుకుని ఆన్‌లైన్‌లో పొందుపర్చనున్నారు.
- సర్వేలో భాగంగా ఇంటి యజమానురాలితోపాటు సభ్యులకు సంబంధించిన వివరాల్ని తప్పులు లేకుండా నమోదు చేస్తారు. వారికి ఉన్న ఆరోగ్యకార్డులు ఇతర వివరాల్ని నమూనా పత్రంలో పొందుపరుస్తారు.
- ముఖ్యంగా రేషన్‌కార్డు సంఖ్య సహా ఆరోగ్య సమాచారాన్ని సమగ్రంగా తీసుకోనున్నారు. పింఛన్ లబ్ధిదారు, స్వయం సహాయక సంఘం సభ్యులు, రైతు భరోసా, రుణమాఫీ, ఆరోగ్యశ్రీ ఇలా అన్నింటి వివరాలు సేకరిస్తారు.
- కుటుంబ సభ్యులు సమ్మతిస్తేనే వారి అందరి ఫొటోను తీసుకుంటారు.
- అన్ని వివరాల సేకరణ తరువాత ఈ డిజిటల్ కార్డుపై ప్రత్యేకమైన నంబరును కేటాయించనున్నారు.
- 200ల లోపు కుటుంబాలు ఉన్న గ్రామాలు, 500ల ఇళ్లలోపు ఉన్న వార్డులను మాత్రమే ప్రస్తుతం ఎంపిక చేశారు.
- కలెక్టర్లు ఈ అయిదు రోజులు ప్రత్యేక పరిశీలన చేపట్టనున్నారు.
- వివరాలెలా సేకరించాలనే విషయమై సిబ్బందికి ప్రత్యేకంగా తర్ఫీదునిచ్చారు. ఎక్కడా తప్పులకు ఆస్కారం లేకుండా పలు అంశాల్ని పొందుపరుస్తారు. సవరణలకు అవకాశాన్ని కల్పించనున్నారు.

ఎంపికైన వార్డులు, గ్రామాలు

పట్టణం	వార్డు	కుటుంబాలు	గ్రామం/మండలం	కుటుంబాలు
రామగుండం	48	782	గుడిపల్లె (పాలకుర్తి)	157
మంథని	13	220	ధరియాపూర్ (ముత్తారం)	108
పెద్దపల్లి	24	288	దుబ్బపల్లి (సుల్తానాబాద్)	145
సిరిసిల్ల	25	350	రామోజీపేట (ఇల్లంతకుంట)	170
వేములవాడ	19	162	బొల్లారం (వేములవాడ గ్రామీణం)	162
కోరుట్ల	18	321	సర్ఫరాజ్‌పల్లి (కోరుట్ల)	150
జగిత్యాల	9	200	వడ్డెర కాలనీ (జగిత్యాల గ్రామీణం)	159
ధర్మపురి	4	264	అబ్బాపూర్ (గొల్లపల్లి)	180
కరీంనగర్(కొత్తపల్లి)	12	232	తాహెర్ కొండాపూర్ (కరీంనగర్ గ్రామీణం)	140
చొప్పదండి	7	235	కోనేరుపల్లి (చొప్పదండి)	180
హుజూరాబాద్	12	279	పాపాయపల్లి (జమ్మికుంట)	165
మానకొండూర్	-	-	నేదునూరు (తిమ్మాపూర్)	139
			అర్కండ్ల(శంకరపట్నం)	171

గాంధీ ఆశయ సాధనకు పాటుపడదాం

వేములవాడ, న్యూస్‌టుడే: మహాత్మా గాంధీ ఆశయ సాధనకు పాటుపడదామని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. బుధవారం వేములవాడ పట్టణంలోని గాంధీనగర్, మున్సిపల్ కార్యాలయం ఆవరణలో జరిగిన జయంతి వేడుకల్లో మున్సిపల్ ఛైర్‌పర్సన్ మాధవి, భాజపా జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణతో కలిసి పాల్గొని గాంధీ విగ్రహాలకు, శాస్త్రినగర్‌లో లాల్ బహదూర్‌శాస్త్రి విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం మున్సిపల్ కార్యాలయంలో కార్మికులకు ప్రశంసాపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి కమిషనర్ సంపత్‌రెడ్డి, కౌన్సిలర్లు, వివిధ పార్టీల నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.



వేములవాడలో నివాళులర్పిస్తున్న విప్ ఆది శ్రీనివాస్, ఛైర్‌పర్సన్ మాధవి, భాజపా జిల్లా అధ్యక్షుడు రామకృష్ణ



కలెక్టరేట్‌లో గాంధీ చిత్రపటం వద్ద జ్యోతిని వెలిగిస్తున్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

సిరిసిల్ల కలెక్టరేట్: సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

రహదారి ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు

బోయినపల్లి, న్యూస్‌టుడే: జిల్లాలో రహదారి ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. సిరిసిల్ల-కరీంనగర్ ప్రధాన రహదారిలోని వెంకట్రావుపల్లి చౌరస్తాను బుధవారం ఎస్పీ పరిశీలించారు. చౌరస్తాలో జరుగుతున్న ప్రమాదాలకు కారణాలు అడిగి తెలుసుకున్నారు. ప్రమాదాలు నివారించడానికి చేపట్టాల్సిన చర్యలపై ఎస్సైకి పలు సూచనలు చేశారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో అధికంగా ప్రమాదాలు జరుగుతున్న ప్రదేశాలను బ్లాక్ స్పాట్‌గా గుర్తిస్తున్నట్లు తెలిపారు. ప్రమాదాలకు కారణాలు తెలుసుకొని నివారణకు సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకుంటూ చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలో పలు పోలీస్ స్టేషన్ల పరిధిలో వాహనాల వేగాన్ని నియంత్రించడానికి రహదారులు, మూలమలుపులు, అప్రోచ్ రోడ్ల వద్ద బారికేడ్లు, రబ్బర్ స్ట్రిప్స్, సైన్ బోర్డులు, వేగనిరోధకాలు ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. వేములవాడ ఏఎస్పీ శేషాద్రినిరెడ్డి, గ్రామీణ సీఐ శ్రీనివాస్, ఎస్సై పృథ్వీధర్ గౌడ్ పాల్గొన్నారు.

ఆట విడుపు... పతకాల గెలుపు

అటవీశాఖ జోనల్ క్రీడల్లో సత్తా చాటిన సిబ్బంది

న్యూస్‌టుడే, సిరిసిల్ల పట్టణం

నిత్యం పని ఒత్తిడితో బిజీగా గడిపే ఉద్యోగులు మైదానం బాట పట్టారు. ఆట విడుపు క్రీడల్లో ఆసక్తి కనబర్చారు. ప్రత్యర్థి జట్టుపై పోటీ పడి పథకాలను కొల్లగొట్టారు. సిద్దిపేటలో అటవీశాఖ ఆధ్వర్యంలో జరిగిన రెండో జోనల్ క్రీడోత్సవాలు మూడు రోజుల క్రితం ముగిశాయి. ఇందులో రాజన్న సిరిసిల్ల ఉద్యోగులు సత్తా చాటారు.

జిల్లాలోని వేములవాడ, సిరిసిల్ల రేంజ్ పరిధి నుంచి 25 మంది ఉద్యోగులు సిద్దిపేటలో మూడు రోజుల కిందట జరిగిన అటవీశాఖ జోనల్ క్రీడా పోటీలకు హాజరయ్యారు. పని ఒత్తిడిని తగ్గిస్తూ ఉత్సాహపరిచేందుకు 104 అంశాల్లో ఆట విడుపు క్రీడలు నిర్వహించగా ఉద్యోగులు తమ క్రీడా స్ఫూర్తిని చాటారు. సీనియర్, జూనియర్ విభాగాల్లో వివిధ ఆటల్లో పోటీ పడ్డారు. తుకారం, రంజిత్‌కుమార్, తిరుపతినాయక్, అనుషా, రమేశ్, అనిల్, లింగం, శ్రీను, బాలకృష్ణ, అభిషేక్, రాజేశ్‌లు ప్రతిభ చాటారు. టగ్‌ఆఫ్ వార్‌లో బంగారు పతకం, క్రికెట్, కబడ్డీ పోటీల్లో రాజన్న సిరిసిల్ల జట్టు ద్వితీయ స్థానంలో నిలిచింది. జోనల్ స్థాయిలో ప్రతిభ కనబర్చిన వీరు ఈ నెల 5, 6 తేదీల్లో హైదరాబాద్‌లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొననున్నారు.



క్రీడల్లో పాల్గొన్న జిల్లా అటవీశాఖ ఉద్యోగులు

ఆటలంటే అమితాసక్తి



చిన్నతనం నుంచి ఆటలంటే అమితాసక్తి. ఏటా నిర్వహించే పోటీల్లో పాల్గొంటాను. క్రీడా స్ఫూర్తితో ఆడితే విజేతగా నిలుస్తామన్నది నమ్మకం. ఒకసారి ఓడితే నిరాశకు గురికాకుండా సాధనతో మరోసారి గెలుస్తామన్న ఆశ క్రీడాకారుల్లో ఉండాలి. సిద్దిపేటలో జరిగిన పోటీల్లో క్యారమ్స్‌లో బంగారు, షటిల్ (మిక్స్‌డ్, డబుల్స్‌లో రజతం, సింగిల్స్‌లో బంగారు), టేబుల్ టెన్నిస్‌లో రజత పతకాలు సాధించాను.

- కల్పనదేవి, అటవీక్షేత్రాధికారి సిరిసిల్ల

పన్నెండేళ్లుగా మొదటి స్థానం



పన్నెండేళ్లుగా అటవీశాఖ జోనల్ స్థాయి క్రీడల్లో పాల్గొంటున్నాను. టగ్ ఆఫ్‌వార్ విభాగంలో ప్రతి సారి విజేతగా మా జట్టు నిలుస్తుంది. ఏటా క్రీడా పోటీల్లో పాల్గొంటే ఉత్సాహంగా ఉంటుంది. అక్కడ ఉన్నతాధికారుల సూచనలు, ప్రోత్సాహం బాగుంటుంది. ఎంతో ఒత్తిడి తగ్గినట్లు ఉంటుంది. టగ్‌ఆఫ్ వార్, వెయిట్ లిఫ్టింగ్, క్యారమ్స్‌లో బంగారు పతకాలు సాధించాను.

- రంజిత్ కుమార్, ఎఫ్ఎస్‌వో, వీర్నపల్లి

మానసిక ఒత్తిడి తగ్గుతుంది



నిత్యం అడవిలో తిరుగుతుండాలి. విధి నిర్వహణలో ఎన్నో సవాళ్లు ఉంటాయి. సంవత్సరానికి ఒకసారి నిర్వహించే క్రీడా పోటీల్లో సరదాగా గడుపుతాం. ఆటలు ఆడుతుంటే బాల్యం గుర్తుకు వస్తుంది. అదే ఉత్సాహంతో పోటా పోటీగా తలపడుతూ ప్రతిభ కనబర్చి పతకాలు సాధించాను.

- అనుషా, బీట్ అధికారి

ధ్రువీకరణ పత్రాల పరిశీలన

సిరిసిల్ల(విద్యానగర్), న్యూస్‌టుడే: ఇటీవల డీఎస్సీ ఫలితాలు విడుదలయ్యాయి. జిల్లాలో మొత్తం 151 పోస్టులకు గాను 1:3 నిష్పత్తిలో మొత్తం 450 మంది అభ్యర్థులను ఎంపిక చేశారు. మంగళవారం రాత్రి వెబ్‌సైట్‌లో 1:3 నిష్పత్తిలో ఎంపికైన అభ్యర్థుల వివరాలను పెట్టారు. సిరిసిల్లలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం ధ్రువీకరణ పత్రాల పరిశీలన ప్రారంభమైంది. మొదటి రోజు మొత్తం 74 మంది పత్రాల పరిశీలన పూర్తయినట్లు జిల్లా విద్యాధికారి రమేశ్‌కుమార్ తెలిపారు.



పరిశీలిస్తున్న అధికారులు

ఆలయ అభివృద్ధి దిశగా అడుగులు

ఈనాడు, సిరిసిల్ల

దక్షిణకాశీగా పేరొందిన వేములవాడ రాజన్న ఆలయాన్ని సమగ్రంగా అభివృద్ధి చేసేందుకు కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులు రానున్నాయి. ప్రసాద్ (తీర్థయాత్రల పునరుజ్జీవనం, ఆధ్యాత్మిక వారసత్వ వృద్ధి) పథకంలో వేములవాడ రాజన్న ఆలయాన్ని చేర్చనున్నారు. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి, ఎంపీ బండి సంజయ్ ఈ ప్రతిపాదనలను ఇప్పటికే కేంద్రం దృష్టికి తీసుకెళ్లారు. త్వరలో తుది నిర్ణయం తీసుకుని అధికారికంగా ప్రకటించనున్నారు. ఈ పథకం కింద ఆలయ పరిసరాలను ఆధ్యాత్మికంగా, పర్యాటకంగా అభివృద్ధి చేయడంతోపాటు భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తారు. దీనికి ముందు వేములవాడ పురపాలిక మాస్టర్ ప్లాన్-2050 అమలు కావాలి. రెండేళ్ల క్రితమే ప్రారంభించిన ఈ ప్రక్రియ డ్రాఫ్ట్ నోటిఫికేషన్‌కు ముందే నిలిచిపోయింది.



రాజన్న ఆలయం నుంచి తిప్పాపూర్ బస్టాండ్‌కు వెళ్లే ప్రధాన దారి

రాజన్న ఆలయం, వేములవాడ పట్టణం అభివృద్ధి రెండూ ఒకదానితో మరొకటి ముడిపడి ఉన్న అంశాలు. దీనికోసం ఏర్పాటు చేసిన వీటీఏడీఏతో ఆలయ విస్తరణ, అభివృద్ధి, పర్యాటకంగా తీర్చిదిద్దాల్సిన వాటిపై ఇప్పటికే ప్రణాళికలు రూపొందించారు. ఇది పూర్తిస్థాయిలో అమలు కావాలంటే మాస్టర్‌ప్లాన్ ప్రధానం. దిల్లీకి చెందిన ప్రైవేటు ఏజెన్సీకి సర్వే బాధ్యతలు అప్పగించారు. వీరు డిసెంబరు నెలాఖరులోగా పూర్తి చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. భవిష్యత్తు అవసరాలు తీర్చేలా కొత్త ప్రణాళిక అమలు కానుంది. పురపాలిక పరిధిలోని ప్రధాన రహదారులకు ఇరువైపులా ఉన్న ప్రాంతాల్లో నివాస, వాణిజ్య జోన్లుగా ఏర్పాటు చేయనున్నారు.

బృహత్తర ప్రణాళిక అమలుతోనే పరిష్కారం

- మాస్టర్ ప్లాన్ సర్వేపై పట్టణ ప్రణాళికాధికారి అన్సారీని 'ఈనాడు' సంప్రదించగా పట్టణంలో ప్రతి ఒక్కరికీ మాస్టర్ ప్లాన్ అమలుపై అవగాహన ఉండాలన్నారు. భవిష్యత్తులో అభివృద్ధి పూర్తిగా దీనిపైనే ఆధారపడి ఉంటుందని తెలిపారు. డ్రాఫ్ట్ పబ్లికేషన్‌లో అభ్యంతరాలను స్వీకరిస్తామన్నారు. వాటికి సమాధానం వచ్చాకే ఆమోదం లభిస్తుందని పేర్కొన్నారు.

- ఆలయం చుట్టూ ఉన్న తోపుడు బండ్లు, దుకాణాలను మార్చేందుకు పురపాలక, ఆలయ యంత్రాంగం ప్రణాళికలు చేస్తుంది. దీంతో ఆలయానికి వచ్చే భక్తులు పట్టణంలోని ఇతర ఆలయాలకు వెళ్లేందుకు మార్గం సుగమమం అవుతుంది. అలాగే గత ప్రభుత్వం 149 ఉత్తర్వులను జారీ చేసింది. దీనిలో ఆలయ పరిసరాల్లో కిలోమీటరు పరిధిలో భవనాలను ఆలయం ఎత్తుకు మించి కట్టరాదనే నిబంధన ఉంది. ఈ ఉత్తర్వులను రద్దు చేయాలని స్థానికుల నుంచి డిమాండ్ ఉంది. తిప్పాపూర్ వంతెన నుంచి ఆలయం వరకు ఉన్న దారిని 80 అడుగులకు విస్తరించనున్నారు. ఇప్పటికే సర్వే కూడా పూర్తయింది. పనులు ప్రారంభించడమే మిగిలింది.

- పట్టణం చుట్టూ 12 చెరువులున్నాయి. వీటిలోకి వరద వచ్చే కాల్వలు, పంట పొలాలకు వెళ్లే కాల్వలు పూర్తిగా ఆక్రమణలకు గురయ్యాయి. జలవనరులశాఖ సూచించిన నాలాల పరిధిలో లేఅవుట్లు, గృహాల నిర్మాణాలకు అనుమతులు నిరాకరించనున్నారు. పురపాలిక అభివృద్ధిలో భాగస్వామ్యంగా ఉన్న అన్ని ప్రభుత్వ శాఖల ఉన్నతాధికారులు, కౌన్సిలర్ల అభిప్రాయాలను మాస్టర్ ప్లాన్‌లో ఉంచుతారు. వీటిపై కౌన్సిల్ సమావేశంలో చర్చిస్తారు. తర్వాత మాస్టర్ ప్లాన్‌ను డ్రాఫ్ట్ పబ్లికేషన్ కోసం నెల రోజులు ప్రజల ముందు ఉంచుతారు. ప్రజల అభ్యంతరాలకు సమాధానం ఇచ్చాక దానికి ఆమోదం లభిస్తుంది. ఈ ప్రక్రియ పూర్తయ్యేసరికి మూడు నెలల సమయం పడుతుంది.

నేటి నుంచి దేవీ నవరాత్రోత్సవాలు

ఏర్పాట్లు పూర్తి చేసిన ఆలయ అధికారులు

వేములవాడ, న్యూస్‌టుడే: ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన వేములవాడలోని శ్రీరాజరాజేశ్వరస్వామి ఆలయంలో గురువారం నుంచి అంగరంగ వైభవంగా దేవీ నవరాత్రోత్సవాలు నిర్వహించనున్నారు. ఆలయ గోపురాలు, ప్రాకారాలను విద్యుత్తు దీపాలతో అందంగా అలంకరించారు. ఆలయ ప్రాంగణాన్ని అరటి, మామిడి, పూల తోరణాలతో అలంకరించారు. ఈ నెల 12 వరకు జరిగే వేడుకలకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు.



విద్యుత్తు కాంతుల్లో రాజన్న ఆలయం

- ఈ నెల 9న మూల నక్షత్ర పుస్తక రూపిణి మహాసరస్వతి పూజ, 10న దుర్గాష్టమి సందర్భంగా చండీ అమ్మవారికి చండీ కలశ ప్రతిష్ఠ, చండీ సప్తశతి హవనం, రాత్రి శ్రీ మహిషాసుర మర్దిని అమ్మవారికి మహాపూజ ఉంటుంది.
- 11న ఉదయం పూర్ణాహుతి, బలిహరణం, రాత్రి అమ్మవారికి ధర్మగుండంలో తెప్పోత్సవం నిర్వహించనున్నారు.
- 12న విజయ దశమి సందర్భంగా ఉదయం ఆయుధ పూజ, సాయంత్రం స్వామివారికి పెద్ద సేవ, శమీపూజ, అపరాజిత పూజను ఘనంగా నిర్వహించనున్నారు.
- ఉత్సవాల సందర్భంగా రోజూ సాయంత్రం ఆలయంలో శ్రీమత్ దేవీ భాగవత పురాణ ప్రవచనం కార్యక్రమాలను నిర్వహించనున్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా...

(10 AM TO 1 PM)

చందుర్తి: 9493188772

గంభీరావుపేట: 8008573611

న్యూస్‌టుడే, కోనరావుపేట

? సమస్య: గ్రామంలోని బీసీ కాలనీలో విద్యుత్తు దీపాలు వెలగటం లేదు. పండగ పూట చీకటి నెలకొని మహిళలు బతుకమ్మ ఆడటానికి ఇబ్బంది పడుతున్నారు. **- సురేశ్, మంగళ్లపల్లి**

✔ విద్యుత్తు దీపాలను పంచాయతీ సిబ్బందితో బాగు చేయించేందుకు చర్యలు తీసుకుంటాం. **- రమేశ్, ఇన్‌ఛార్జి పంచాయతీ కార్యదర్శి, మంగళ్లపల్లి**

వరద కాలువలో గల్లంతైన రైతు మృతి

బోయినపల్లి, న్యూస్‌టుడే: వరద కాలువలో మోటారు మరమ్మతు కోసం నీటిలో దిగి విద్యుదాఘాతంతో మంగళవారం గల్లంతైన కొదురుపాకకు చెందిన నాగుల కిషన్ గౌడ్ (37) మృతి చెందాడు. కరీంనగర్ నుంచి వచ్చిన రెస్క్యూ బృందం బుధవారం వరద కాలువలో గాలింపు చర్యలు చేపట్టి కిషన్‌గౌడ్ మృతదేహాన్ని బయటకు తీసింది. పోలీసులు పంచనామా నిర్వహించిన అనంతరం శవపరీక్ష కోసం మృతదేహాన్ని సిరిసిల్ల ఆసుపత్రికి తరలించారు. కిషన్ మృతి చెందిన విషయం తెలియడంతో కుటుంబ సభ్యులు బోరున విలపించారు. దేశాయపల్లి వద్ద కౌలుకు తీసుకొని పొలం సాగు చేస్తున్నాడని, పొలానికి నీరందించేందుకు వరద కాలువ వద్ద వేసిన మోటారు మరమ్మతు చేస్తున్న సమయంలో నీటిలో దిగడంతో విద్యుదాఘాతంతో కిషన్ గౌడ్ మృతి చెందినట్లు అతని భార్య రేఖ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పృథ్వీధర్ గౌడ్ తెలిపారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం, సెస్ ఆదుకోవాలని గ్రామస్థులు కోరారు.

హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఆత్మహత్యాయత్నం

ఎల్లారెడ్డిపేట, న్యూస్‌టుడే: ఎల్లారెడ్డిపేట మండల కేంద్రానికి చెందిన అవినాష్ అనే సాఫ్ట్‌వేర్ ఉద్యోగి హైదరాబాద్‌లో బుధవారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు గ్రామస్థులు తెలిపారు. సమాచారం అందుకున్న కుటుంబీకులు, బంధువులు వెంటనే హైదరాబాద్‌కు తరలివెళ్లారు. అవినాష్ గత కొంతకాలంగా హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పని చేస్తున్నాడు. పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించారు. ఆత్మహత్యాయత్నానికి కారణాలు తెలియాల్సి ఉంది.

యువకుడు...

బోయినపల్లి: సిరిసిల్ల-కరీంనగర్ ప్రధాన రహదారిలోని కొదురుపాక నాలుగు వరుసల వంతెనపై నుంచి మధ్యమానేరు జలాశయం బ్యాక్‌వాటర్‌లో దూకి యువకుడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన బుధవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... సిద్దిపేటకు చెందిన సంజీవ్‌కుమార్ నాలుగు వరుసల వంతెన రక్షణ గోడకు ఏర్పాటు చేసిన జాలీపైకి ఎక్కి జలాశయంలో దూకడానికి ప్రయత్నిస్తున్నాడు. అటుగా వెళ్తున్న వాహనదారులు గమనించి ఆత్మహత్య చేసుకోవద్దని సూచించారు. ఉపాధి చూపిస్తామని, ఆలోచన విరమించుకొని జాలీ ఎక్కి వంతెనపైకి రావాలని కోరడంతో వచ్చాడు. ఆటో డ్రైవర్‌గా పని చేస్తున్నానని, తన బంధువు తనకు ఇవ్వాల్సిన డబ్బులు ఇవ్వకపోగా తిట్టినట్లు చెప్పాడు. దీంతో జీవితంపై విరక్తి చెందిన ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించినట్లు తెలిపాడు. సంజీవ్‌ను కాపాడిన వారు అతడికి డబ్బులు ఇచ్చి సిద్దిపేట వెళ్లాలని సూచించి బస్సు ఎక్కించి పంపించారు.

బంపర్ ఆఫర్ పేరుతో మోసం.. పది మందిపై కేసు

వేములవాడ, న్యూస్‌టుడే: జిల్లాలో దసరా పండగ సందర్భంగా బంపర్ ఆఫర్, దసరా ధమాకా పేర్లతో సోషల్ మీడియాలో రూ. 100 కొట్టు, మేకను పట్టు అనే క్యాప్షన్‌తో అమాయక ప్రజలను మోసం చేస్తున్న నిర్వాహకులపై కేసులు నమోదు చేసినట్లు ఎస్పీ అఖిల్ మహాజన్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. వేములవాడ పట్టణ పరిధిలో శ్రీకాంత్, ఆవునూరి ప్రశాంత్, మహేందర్, వెంకటేశ్, స్వామిలతో పాటు కొడుముంజ గ్రామానికి చెందిన వికాస్, సాయి, అజయ్, రమేశ్, చందులు దసరా బంపర్ ఆఫర్ల పేరుతో డబ్బులు వసూలు చేస్తూ వివిధ రకాల వస్తువులు, మేక, రైస్ కుక్కర్, కోళ్లు, పట్టుచీర, పది గ్రాముల వెండి నాణెం, మద్యం బాటిల్ వంటి బహుమతులు ఇస్తామని మోసం చేస్తున్నారని పేర్కొన్నారు. ఇలాంటి వారిపై పోలీసులకు సమాచారం ఇవ్వాలని, వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్పీ తెలిపారు.

ఇసుక అక్రమార్కులకు రిమాండ్


తంగళ్లపల్లి, న్యూస్‌టుడే: ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక రవాణాకు పాల్పడుతున్న శివరాత్రి రాజు, కొంపెల్లి బాలకిషన్, కంచర్ల బాలరాజులపై కేసు నమోదు చేసి బుధవారం రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై రామ్మోహన్ తెలిపారు. తంగళ్లపల్లి మండలం పద్మనగర్ గ్రామ శివారులో మానేరు వాగు నుంచి ట్రాక్టర్ ద్వారా అక్రమంగా ఇసుకను తరలిస్తూ ఓ లారీలో లోడ్ చేస్తుండగా పట్టుకున్నామన్నారు. లారీని, ట్రాక్టర్‌ను సీజ్ చేసి స్టేషన్‌కు తరలించినట్లు ఆయన పేర్కొన్నారు.

భక్తులను బెదిరించి డబ్బు వసూలు... ముగ్గురి అరెస్టు

వేములవాడ, న్యూస్‌టుడే: రాజన్న దర్శనానికి వచ్చిన ఓ కుటుంబాన్ని చంపుతామని బెదిరించి వారి నుంచి డబ్బులు వసూలు చేసిన ముగ్గురిని బుధవారం అరెస్టు చేసినట్లు పట్టణ సీఐ వీరప్రసాద్ తెలిపారు. సిద్దిపేట జిల్లా తొగుట మండలంలోని వెంకట్రావ్‌పేట గ్రామానికి చెందిన ఊదుగల రాజు తన కుటుంబంతో ఆటోలో రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడలోని శ్రీరాజరాజేశ్వరస్వామి దర్శనానికి మంగళవారం వచ్చారు. ఆటోను ఆలయ పార్కింగ్ ప్రాంతంలో పెట్టి అందులోనే రాజుతోపాటు అతని సోదరుడు సంతోష్ పడుకున్నారు. బుధవారం తెల్లవారుజామున 3 గంటల ప్రాంతంలో సుందరవేణి శివ, సూర ప్రశాంత్, కురుకుంట బాబు అనే ముగ్గురు వ్యక్తులు ఆటో వద్దకు వచ్చి బీరు సీసాతో చంపుతామని బెదిరించి వారి వద్ద రూ. 1500 తీసుకొని పారిపోయారు. బాధితుడి ఫిర్యాదు మేరకు ముగ్గురిని పట్టుకొని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ వెల్లడించారు.

కుక్క దాడిలో బాలుడికి గాయాలు

బోయినపల్లి, న్యూస్‌టుడే: ఇంటి ముందు నిలుచున్న బాలుడిపై కుక్క దాడి చేసి గాయపర్చిన సంఘటన బుధవారం రాత్రి బోయినపల్లిలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన నాలుగేళ్ల బాలుడు విశ్వ ఇంటి ముందు నిలబడ్డాడు. అటుగా వెళ్తున్న కుక్క ఒక్కసారిగా విశ్వపై దాడి చేయడంతో తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన కుటుంబ సభ్యులు కరీంనగర్‌లోని ఓ ఆసుపత్రికి తరలించారు.



మురుగుతో దుర్వాసన



కోనరావుపేట మండలం కనగర్తి అంగన్‌వాడీ కేంద్రం, ప్రాథమిక, ఉన్నత పాఠశాలల దారి, బ్రహ్మంగారి ఆలయం, సీసీ రోడ్డు మధ్య కాలువలో జనావాసాల నుంచి వెలువడిన నీరు రోజుల తరబడి నిల్వ ఉంటుంది. మురుగు ముందుకు వెళ్లకుండా సమీపంలోని వ్యవసాయ క్షేత్రాలకు చెందిన రైతులు అడ్డుకట్ట వేశారు. దీంతో అక్కడే నిల్వ ఉండటంతో దుర్వాసన వస్తోంది. దోమలు, ఈగలు వృద్ధి చెంది వ్యాధుల బారిన పడే అవకాశం ఉంది. నిత్యం విద్యార్థులు, రైతులు, ఆయా కాలనీవాసులు రాకపోకలు సాగిస్తున్నారు. అధికారులు స్పందించి సమస్యకు పరిష్కారం చూపాలని గ్రామస్థులు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, కోనరావుపేట**

నిరంతర వెలుగులు



సిరిసిల్ల పట్టణం ఏడో వార్డులోని ప్రధాన రహదారుల్లో వీధి దీపాలు పది రోజులుగా నిరంతరాయంగా వెలుగుతూనే ఉన్నాయి. సినారె కళామందిర్ ఎదుట, డీఎస్పీ కార్యాలయం, నెహ్రూ నగర్ ప్రధాన రహదారుల్లోని వీధి దీపాల నిర్వహణ కొరవడింది. కొన్ని చోట్ల పాడయ్యాయి. మరికొన్ని చోట్ల నిరంతరాయంగా వెలుగుతున్నాయి. దీంతో విద్యుత్తు వృథా కావడంతోపాటు పురపాలక సంఘంపై ఆర్థికభారం పడనున్నది. ఉన్నవి కూడా కాలిపోయే ప్రమాదం ఉంది. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి రాత్రి సమయంలో మాత్రమే వెలిగేలా చూడాలని పలువురు కోరుతున్నారు.

- న్యూస్‌టుడే, సిరిసిల్ల అర్బన్

గుంతలున్నాయి.. జాగ్రత్త!



సిరిసిల్ల పట్టణంలోని విమల్ థియేటర్ ఎదుట ప్రధాన రహదారిలో గుంతలు ఏర్పడి పాదచారులు, వాహనదారులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. ఈ మార్గంలో రోజూ వందలాది వాహనాల రాకపోకలు సాగుతుంటాయి. నిత్యం రద్దీగా ఉండే ఈ రహదారిలో రాత్రి సమయంలో గుంతలు కనిపించకపోవడంతో తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి గుంతలు పూడ్చివేయాలని పలువురు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, సిరిసిల్ల అర్బన్**


రాచర్ల బొప్పాపూర్‌లో బతుకమ్మ ఆడుతున్న మహిళలు


ఎల్లారెడ్డిపేటలో...


రుద్రవరంలో...


సిరిసిల్ల: ఆర్యవైశ్య భవనంలో..

ఘనంగా ఎంగిలిపూల బతుకమ్మ వేడుకలు

జిల్లాలో ఎంగిలిపూల బతుకమ్మ వేడుకలను బుధవారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. అందంగా పేర్చిన బతుకమ్మలను ప్రధాన కూడళ్లలో పెట్టి, మహిళలు, యువతులు, చిన్నారులు బతుకమ్మ ఆడారు. అనంతరం సమీప నీటి వనరుల్లో నిమజ్జనం చేశారు. వాయినాలు ఇచ్చిపుచ్చుకున్నారు. **- న్యూస్‌టుడే యంత్రాంగం**


చందుర్తి: తిమ్మాపూర్‌లో...


విద్యానగర్‌లో...


వేములవాడ: ఆలయ ధర్మగుండంలో నిమజ్జనం చేస్తున్న మహిళలు


ముస్తాబాద్‌లో...


వెంకట్రావుపల్లిలో...


మంగళ్లపల్లిలో...


వీర్నపల్లిలో...


ఇల్లంతకుంటలో...


సిరిసిల్లలో...

శాంతి భద్రతలకు విఘాతం కలిగించేవారిపై చర్యలు

వేములవాడ, న్యూస్‌టుడే: శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకొంటామని ఎస్పీ అఖిల్ మహాజన్ పేర్కొన్నారు. బుధవారం వేములవాడ పట్టణ పోలీస్ స్టేషన్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఠాణాలోని రికార్డులను తనిఖీ చేశారు. పెండింగ్ కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఆధ్యాత్మిక పట్టణమైన వేములవాడలో విజిబుల్ పోలీసింగ్‌పై ప్రత్యేక దృష్టి సారించాలని చెప్పారు. పట్టణ పరిధిలో శాంతి భద్రతలను పకడ్బందీగా అమలు చేయాలని ఆదేశించారు. స్థానికంగా ఉండే శాంతి భద్రత సమస్యలు, రౌడీ షీటర్లు, హిస్టరీ షీటర్లపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి వారి కదలికలపై ఎప్పటికప్పుడు ఆరా తీయాలని ఆదేశించారు. స్టేషన్ సిబ్బందిని నామినల్ రోల్ ఆధారంగా ఏయే విధులు నిర్వహిస్తున్నారో అడిగి తెలుసుకున్నారు. బ్లూకోల్ట్స్, పెట్రోకార్ సిబ్బంది డయల్ 100 కాల్స్‌కు తక్షణమే స్పందించి సమస్య పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. వేములవాడ ఏఎస్పీ శేషాద్రినిరెడ్డి, పట్టణ సీఐ వీర ప్రసాద్, ఎస్సై అంజయ్య పాల్గొన్నారు.


వేములవాడ పట్టణ పోలీస్ స్టేషన్‌లో రికార్డులను తనిఖీ చేస్తున్న ఎస్పీ అఖిల్ మహాజన్, చిత్రంలో ఏఎస్పీ శేషాద్రినిరెడ్డి

పండగలకు అన్ని ఏర్పాట్లు చేయాలి

ఎల్లారెడ్డిపేట, న్యూస్‌టుడే: బతుకమ్మ, దసరా, దీపావళి పండగలకు గ్రామాల్లో ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా అన్ని చర్యలు చేపట్టాలని, ప్రధాన కూడళ్లను సుందరంగా తీర్చిదిద్దాలని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా పేర్కొన్నారు. ఎల్లారెడ్డిపేట మండల పరిషత్తు కార్యాలయంలో ఇన్‌ఛార్జి డీపీవో శేషాద్రితో కలిసి ఎల్లారెడ్డిపేట, వీర్నపల్లి, ముస్తాబాద్ మండలాల ఎంపీడీవోలు, తహసీల్దార్లు, ప్రత్యేకాధికారులు, గ్రామ పంచాయతీ కార్యదర్శులతో బుధవారం సమీక్షాసమావేశం నిర్వహించారు. గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు, ఇంటి పన్ను వసూళ్లపై చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామాల్లో ఏమైనా సమస్యలుంటే ప్రత్యేకాధికారులు, ఇన్‌ఛార్జిలు ఇప్పటి నుంచే పరిష్కరిస్తూ పండగల నాటికి సరైన ఏర్పాట్లు చేయాలన్నారు. గ్రామాల్లో పారిశుద్ధ్య పనులను క్రమం తప్పకుండా చేయించాలని పేర్కొన్నారు. అనంతరం ఎల్ఆర్ఎస్‌పై అధికారులతో మాట్లాడారు. ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు ఎన్ని వచ్చాయి, ఇప్పటి వరకు ఎన్నింటిని పరిష్కరించారు అనే విషయాలను తహసీల్దార్లను అడిగి తెలుసుకున్నారు. మూడు మండలాల్లో కలిపి మొత్తం 5,017 దరఖాస్తులు రాగా, ఇప్పటి వరకు 857 పరిష్కరించామని అధికారులు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు.

మత్తు పదార్థాలపై యుద్ధం చేయండి

వీర్నపల్లి, న్యూస్‌టుడే: మత్తు పదార్థాలను సమూలంగా నిర్మూలించేందుకు రవాణా, విక్రయాలపై యుద్ధం చేయాలని సీఐడీ ఎస్పీ (కోర్టు మానిటరింగ్ సిస్టం, హైదరాబాద్) భూక్య రాంరెడ్డి పేర్కొన్నారు. వీర్నపల్లి మండలం గర్జనపల్లిలో బుధవారం మానాలలో నిర్వహించే మారథాన్ కరపత్రాలను ఆవిష్కరించారు. ఇటీవల ప్రకటించిన డీఎస్సీ ఫలితాల్లో సత్తా చాటిన అజ్మీరా తిరుపతి, మాలోతు రవి, కానిస్టేబుల్‌గా ఉద్యోగం సాధించిన భాస్కర్‌ను శాలువాతో సత్కరించారు.

తొలి ప్రయత్నం... నెరవేరిన ఆశయం

వీర్నపల్లి, న్యూస్‌టుడే: తొలి ప్రయత్నంలోనే తండ్రి ఆశయాన్ని నెరవేరుస్తూ యువతి వైద్య విద్యలో సీటు సాధించింది. వీర్నపల్లి మండలం సీతారాంనాయక్‌తండాకు చెందిన ఈశ్వర్, కవిత దంపతులకు ఇద్దరు సంతానం. ఈశ్వర్ ఆర్ఎంపీగా సేవలందించాడు. కుమార్తె కృష్ణశ్రీని డాక్టర్ చదవించాలనుకున్నాడు. అయితే కొంతకాలం క్రితం అనారోగ్యంతో మృతి చెందగా తల్లి కవిత పంచాయతీరాజ్‌శాఖ కార్యాలయంలో అటెండర్‌గా పని చేస్తున్నారు. తండ్రి ఆశయాన్ని లక్ష్యంగా మలచుకుని కృష్ణశ్రీ చదివింది. తొలి ప్రయత్నంలోనే మెడికల్ సీటు సాధించింది. మండలంలో తండ్రి పేరిట ఆసుపత్రి నిర్మించి సేవలందిస్తానని చెప్పింది.


కృష్ణశ్రీ

ఎంబీబీఎస్‌లో సీటు సాధించిన రైతు బిడ్డ


విష్ణువర్ధన్‌రెడ్డి

పల్లిమక్త (కోనరావుపేట): కోనరావుపేట మండలం పల్లిమక్తకు చెందిన కదిరె దుర్గారెడ్డి-పద్మ దంపతులకు ఇద్దరు కుమారులు. కొద్దిపాటి వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. పెద్ద కుమారుడు విష్ణువర్ధన్‌రెడ్డి గత ఏడాది నీట్ పరీక్ష రాయగా ఎంబీబీఎస్‌కు అర్హత సాధించలేదు. నిరుత్సాహ పడకుండా ఈ ఏడాది ప్రణాళిక ప్రకారం చదివి సింగరేణి వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ సీటు సాధించాడు.

రాష్ట్ర స్థాయి సైకిల్ పోలో క్రీడల్లో సత్తా చాటిన యువకుడు

వేములవాడ గ్రామీణం, న్యూస్‌టుడే: రాష్ట్ర స్థాయి సైకిల్ పోలో క్రీడల్లో వేములవాడ గ్రామీణ మండలం నాగయ్యపల్లికి చెందిన బండి అభినయ్ సత్తా చాటాడు. గంగాధర మండలం కురిక్యాలలోని ఎస్ఆర్ కళాశాలలో ఆదివారం జరిగిన అండర్-19 రాష్ట్ర స్థాయి పోటీల్లో అభినయ్ జట్టు ఉత్తమ ప్రతిభ కనబరిచి మూడో స్థానంలో నిలిచింది. అభినయ్ జగిత్యాల జిల్లా కోరుట్లలోని సాంఘిక సంక్షేమ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. ఈ సందర్భంగా గ్రామస్థులు అభినందించారు.

డీఎస్సీలో మెరిశారు

గంభీరావుపేట, న్యూస్‌టుడే: కృషి, పట్టుదల ఉంటే ఏదైనా సాధించవచ్చని నిరూపించారు గ్రామీణ ప్రాంత యువతీ, యువకులు. ఎటువంటి శిక్షణ లేకుండా స్వతహాగా సిద్ధమై డీఎస్సీలో సత్తా చాటి పలువురికి ఆదర్శంగా నిలిచారు.

స్కూల్ అసిస్టెంట్‌లో జిల్లా ప్రథమ ర్యాంకు


బాలకృష్ణ

గంభీరావుపేట మండలం లింగన్నపేటలో కిరాణా దుకాణం నిర్వహిస్తున్న బొందుగుల వెంకటయ్య, పద్మమ్మలకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. పెద్ద కుమారుడు రమేశ్ కేంద్ర ప్రభుత్వ ఉద్యోగం సాధించాడు. చిన్నకుమారుడు బాలకృష్ణ సైతం డిగ్రీ, బీఎడ్, ఎంసీఏ పూర్తి చేశాడు. ఇటీవల టీజీటీ ఉద్యోగం సాధించి ప్రస్తుతం మెదక్ జిల్లా వర్గల్‌లోని గురుకుల పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నాడు. ప్రస్తుతం డీఎస్సీ ఫలితాల్లో స్కూల్ అసిస్టెంట్ గణితంలో జిల్లా ప్రథమ ర్యాంకు సాధించాడు.

అంధత్వాన్ని జయించి...


రేవతి

గంభీరావుపేట మండలం భీముని మల్లారెడ్డిపేటకు చెందిన పాతూరి రేవతి డీఎస్సీ ఫలితాల్లో సత్తా చాటింది. ఎస్జీటీలో జిల్లాలో రెండో ర్యాంకు సాధించి అంధత్వం ప్రతిభకు అడ్డురాదని నిరూపించింది. గ్రామానికి చెందిన పాతూరి శ్రీనివాస్‌రెడ్డికి ఇద్దరు కూతుళ్లు. చిన్న కూతురు రేవతి పుట్టుకతోనే అంధురాలు. కరీంనగర్‌లోని అంధుల పాఠశాలలో పదో తరగతి వరకు చదివి, హైదరాబాద్‌లోని ప్రత్యేక అవసరాలు కలిగిన పాఠశాలలో గ్రాడ్యుయేషన్ పూర్తి చేసింది. డీఎడ్ పూర్తి చేసి టెట్‌లో మంచి ఉత్తీర్ణత సాధించింది. ప్రత్యేక అవసరాలు గల పాఠశాల పోస్టుల్లో జిల్లాలో రెండో ర్యాంకు సాధించింది.

బతుకమ్మ వేడుకలకు భారీ ఏర్పాట్లు

వేములవాడ, న్యూస్‌టుడే: వేములవాడ పట్టణంలో బతుకమ్మ వేడుకల సందర్భంగా వచ్చే మహిళలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా భారీ ఏర్పాట్లు చేస్తున్నట్లు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. బుధవారం పట్టణంలో రెండో బైపాస్ రోడ్డులోని బతుకమ్మ తెప్ప వద్ద వేడుకల ఏర్పాట్లను మున్సిపల్ ఛైర్‌పర్సన్ రామతీర్థపు మాధవి, భాజపా జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ, కౌన్సిలర్లతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా విప్ మాట్లాడుతూ బతుకమ్మ తెప్ప వద్ద ఆహ్లాదకరమైన వాతావరణం ఏర్పడేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు వెల్లడించారు. వేడుకలకు ప్రభుత్వం తరపున తగిన సహాయ సహకారాలు ఉంటాయని చెప్పారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి కమిషనర్ సంపత్‌రెడ్డి, వైస్ ఛైర్మన్ బింగి మహేశ్, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.


సిరిసిల్ల: నివాళులర్పిస్తున్న ఎస్పీ అఖిల్‌మహాజన్


సిరిసిల్లలో మున్సిపల్ అధ్యక్షురాలు కళ, కౌన్సిలర్లు, భారాస నాయకులు...


సిరిసిల్లలో కాంగ్రెస్ నాయకులు


చందుర్తిలో ...

గాంధీకి ఘన నివాళి

జిల్లాలో బుధవారం గాంధీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహాలకు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయా కార్యక్రమాల్లో అధికారులు, వివిధ పార్టీల నాయకులు తదితరులు పాల్గొన్నారు. **- న్యూస్‌టుడే బృందం**


బోయినపల్లి మండల పరిషత్తులో...


గంభీరావుపేటలో...

పండగ వేళ.. మెరుగైన సేవలు

ఆర్టీసీలో ముందస్తు రిజర్వేషన్‌కు అవకాశం

న్యూస్‌టుడే, కరీంనగర్ రవాణా విభాగం

బతుకమ్మ, దసరా.. తెలంగాణలో ఎంతో ప్రాముఖ్యం గల పండగలు. వీటిని పురస్కరించుకొని ప్రయాణికులను వారి గమ్యస్థానాలకు చేరవేసేందుకు కరీంనగర్ రీజియన్‌లో టీజీఎస్‌-ఆర్టీసీ ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. అందివచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవడంతోపాటు సంస్థకు ఆదాయాన్ని పెంచడం, ప్రయాణికుల రద్దీని తట్టుకొని మెరుగైన సేవలు అందించాలనే సంకల్పంతో ప్రత్యేక బస్సులను నడుపుతోంది. పండగల నేపథ్యంలో విద్య, ఉద్యోగ, వ్యాపార, వాణిజ్య అవసరాల నిమిత్తం ఎక్కడెక్కడో ఉన్న వారు సైతం స్వగ్రామాల బాట పడుతున్నారు. మరోవైపు ఈ నెల 2 నుంచి విద్యాసంస్థలకు సెలవులు ప్రకటించారు. దీంతో వివిధ బస్టాండ్‌ల్లో రద్దీ పెరిగే అవకాశం ఉంటుంది. ఈ నేపథ్యంలో కరీంనగర్ రీజియన్ నుంచి టీజీఎస్‌-ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడుపుతోంది.



కరీంనగర్ బస్టాండ్‌లో ప్రయాణికుల రద్దీ

రద్దీని తట్టుకోవడం సాధ్యమేనా?

■ ఇతర డిపోల బస్సులను తెప్పించడంతోపాటు కొత్తగా 33 ఎలక్ట్రిక్ సూపర్ లగ్జరీ బస్సులు కరీంనగర్‌-2 డిపోనకు అందుబాటులోకి రావడం ఉపశమనం కలిగించే అంశమని భావిస్తున్నారు.

■ ఆర్టీసీ బస్సుల్లో (పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్) మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించిన తర్వాత ప్రయాణికుల సంఖ్య గణనీయంగా పెరిగింది.

■ మహాలక్ష్మి పథకానికి ముందు రోజు 1.50 నుంచి 2.50 లక్షల మంది ప్రయాణించగా ప్రస్తుతం ఆ సంఖ్య 4.50 లక్షలకు లక్షలకు చేరింది. ■ బతుకమ్మ, దసరాల సందర్భంగా ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది. ■ ఆక్యుపెన్సీ రేషియో కూడా 95 శాతానికి పైగా ఉంటోంది. కొన్ని సందర్భాల్లో వందశాతం దాటుతోంది.

డీఎంల పర్యవేక్షణ

ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నారు. బస్టాండ్‌ను శుభ్రంగా ఉంచడంతోపాటు తాగునీటికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూస్తున్నారు. డిప్యూటీ ఆర్‌ఎంలు, రీజియన్‌లోని 11 డిపోల డీఎంలు, సూపర్‌వైజర్లు, ఇతర అధికారులు విడతల వారీగా జేబీఎస్ బస్టాండ్‌లో విధులు నిర్వహిస్తున్నారు. రద్దీకి అనుగుణంగా బస్సులు నడపేలా చర్యలు చేపడుతున్నారు. తిరుగు ప్రయాణంలో కరీంనగర్‌తోపాటు ఇతర బస్టాండ్‌ల్లో ఆయా డిపోల డీఎంలు ఉంటూ పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారు.

జేబీఎస్ నుంచి కరీంనగర్‌కు 810 బస్సులు

దసరా సందర్భంగా రద్దీ దృష్ట్యా కరీంనగర్ రీజియన్‌కు సంబంధించి ఈ నెల 1 నుంచి 11 వరకు జేబీఎస్ నుంచి కరీంనగర్‌కు 810 బస్సులు, అక్టోబరు 12 నుంచి 21 వరకు 850 అదనపు బస్సులు తిప్పాలని అధికారులు నిర్ణయించారు. వీటితోపాటు రోజువారీగా నడిపే బస్సులు ఆయా రూట్లలో నడపనున్నారు.



www.tsrtconline.in/ www.tgsrtcbus.in / oprs.web సందర్శించి ముందస్తు టికెట్ రిజర్వేషన్ చేసుకునే వీలు కల్పించారు.

బస్సుల్లో ప్రయాణించండి

ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చేలా ఏర్పాట్లు చేశాం. రద్దీకి అనుగుణంగా బస్సులు తిప్పడానికి అవసరమైన చర్యలు తీసుకుంటాం. ఆర్టీసీ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి.

- సుచరిత, కరీంనగర్ రీజినల్ మేనేజర్

భళా.. బాలలు

జాతీయ స్థాయి స్కేటింగ్‌లో రాణింపు

న్యూస్‌టుడే, జ్యోతినగర్ (మార్కండేయకాలనీ)



పతకాలతో రాష్ట్ర స్థాయికి ఎంపికైన క్రీడాకారులు

స్కేటింగ్.. సరదా అనిపించే క్రీడ. అలా సరదాగా మొదలు పెట్టిన వారికి అదే జీవితమైంది. ఇందులో కొందరు చాలాసార్లు జాతీయస్థాయిలో ఎంపికయ్యారు. తమ ప్రతిభతో రామగుండం విద్యార్థులు ప్రశంసలు దక్కించుకున్నారు. ఉమ్మడి జిల్లాకు గర్వకారణంగా నిలిచారు. ఇటీవల ఎస్జీఎఫ్ పర్మి సెంటెనరీషిప్‌లో రోలర్ స్కేటింగ్ క్రీడా ప్రాంగణంలో జిల్లా స్థాయి ఛాంపియన్ షిప్ ఉమ్మడి కరీంనగర్ నుంచి సుమారు వంద మంది పాల్గొన్నారు. ఇందులో 30 మంది క్రీడాకారులు ప్రతిభ కనబరచి ఈనెల 4, 5వ తేదీల్లో భువనగిరిలో జరుగనున్న రాష్ట్ర స్థాయి రోలర్ స్కేటింగ్ పోటీలకు ప్రాతినిధ్యం వహించనున్నారు. వీరిపై న్యూస్‌టుడే కథనం.

నాలుగుసార్లు జాతీయస్థాయిలో..



రోలర్ స్కేటింగ్ అంటే చాలా ఇష్టం. చిన్నప్పుడు సరదాగా అనిపించి ఇందులో శిక్షణ తీసుకున్నా. క్రమేపీ ఆసక్తి పెరిగింది. నిత్యం సాధన చేస్తూ పలు పోటీల్లో పాల్గొంటున్నా. ఇప్పటివరకు నాలుగుసార్లు జాతీయస్థాయి రోలర్ స్కేటింగ్‌లో పాల్గొని ప్రశంసపత్రాలు పొందాను. జిల్లా స్థాయి పోటీల్లో సుమారు 20 సార్లు పాల్గొని బంగారు, వెండి పతకాలు సాధించా. ప్రస్తుతం భువనగిరిలో నిర్వహించే రాష్ట్ర స్థాయిలో పాల్గొని సత్తా చాటుతా. **- రావుల అక్షర, విద్యార్థిని**

శిక్షకుల సూచనలతో..



అయిదేళ్లుగా రోలర్ స్కేటింగ్‌లో శిక్షణ పొందుతున్నా. శిక్షకుల మార్గదర్శకత్వంలో మెలకువలు నేర్చుకుంటున్నా. ఇప్పటివరకు మూడుసార్లు జాతీయస్థాయి పోటీల్లో పాల్గొని 4వ, 5వ స్థానాల్లో నిలిచి ప్రశంసపత్రాలు పొందా. రాష్ట్ర స్థాయి పోటీల్లో ఎనిమిది సార్లు పాల్గొన్నా. నిత్య సాధనతోనే ప్రతి క్రీడల్లో విజయం సాధించవచ్చని నమ్ముతున్నా. **- ఎం.అజిత్ యాదవ్, విద్యార్థి**

ప్రథమ శ్రేణియే లక్ష్యంగా



పంజాబ్, తమిళనాడులో నిర్వహించిన జాతీయస్థాయి రోలర్ స్కేటింగ్ పోటీల్లో పాల్గొని ప్రశంసపత్రాలు పొందా. జాతీయస్థాయి పోటీల్లో ప్రథమ శ్రేణిలో నిలిచి బంగారు పతకం సాధించడమే లక్ష్యంగా పెట్టుకున్నా. చదువుతోపాటు క్రీడలకు సమాన ప్రాధాన్యత కల్పిస్తూ ముందుకు వెళ్తున్నా. శిక్షకుల నుంచి సలహాలు తీసుకుంటేనే విజయం సొంతమవుతుందని నమ్ముతున్నా. **- మణికృష్ణ, విద్యార్థి**

పదహారేళ్లుగా శిక్షణ అందిస్తున్నా..



రోలర్ స్కేటింగ్‌లో గత పదహారేళ్లుగా విద్యార్థులకు శిక్షణ అందిస్తున్నా. నిత్యం సాధన చేస్తే అనుకున్న లక్ష్యాన్ని అందిపుచ్చుకోవచ్చు. అన్ని క్రీడలతో పోలిస్తే వినూత్నంగా ఉంటుంది. ప్రతి విద్యార్థి క్రీడల్లో ఉన్నతంగా రాణిస్తే ప్రభుత్వ ఉద్యోగాలకు అవకాశముంటుంది. రోలర్ స్కేటింగ్‌ను ఒలింపిక్స్‌లో పాల్గొనే క్రీడాకారులు సైతం ఆడుతారు. **- కృష్ణమూర్తి, రోలర్ స్కేటింగ్ కార్యదర్శి**

స్వచ్ఛభారత్ దివస్‌కు కోరుట్ల పురపాలిక ఎంపిక



దిల్లీలో జరిగిన సభకు హాజరైన కోరుట్ల మున్సిపల్ ఛైర్‌పర్సన్ అన్నం లావణ్య

కోరుట్ల, న్యూస్‌టుడే: స్వచ్ఛభారత్ మిషన్ ప్రారంభమై 10 ఏళ్లు గడిచిన సందర్భంగా బుధవారం దిల్లీలో నిర్వహించిన స్వచ్ఛభారత్ దివస్ కార్యక్రమానికి కోరుట్ల పురపాలక సంఘం ఎంపికైంది. కోరుట్ల పురపాలిక తరపున ఛైర్‌పర్సన్ అన్నం లావణ్య, కమిషనర్ బట్టు తిరుపతి హాజరయ్యారు. తెలంగాణ నుంచి కల్వకుర్తి, సిద్దిపేట, కోరుట్ల, వరంగల్ ఎంపికయ్యాయి.

నకిలీ నోట్ల ముఠా అరెస్టు



కోరుట్లలో పోలీసులు పట్టుకున్న నకిలీ రూ.500 నోట్లు

కోరుట్ల, న్యూస్‌టుడే: కోరుట్ల పట్టణంలో నకిలీ నోట్లు చెలామణి చేస్తున్న ముఠాను పట్టుకున్నట్లు డీఎస్పీ ఉమామహేశ్వర్‌రావు తెలిపారు. బుధవారం కోరుట్ల పోలీస్‌స్టేషన్ ఏర్పాటు చేసిన సమావేశంలో వివరాలు వెల్లడించారు. సెప్టెంబర్ 28న పట్టణంలోని వేములవాడరోడ్డులో కొబ్బరిబోండాల విక్రయ దుకాణం వద్దకు ఓ వ్యక్తి వచ్చి కొబ్బరి నీళ్లు తాగి రూ.500 నోట్ ఇచ్చి చిల్లర తీసుకొని వెళ్లాడు. తర్వాత డబ్బులు లెక్కిస్తుండగా రూ.500 నోట్ తేడాగా ఉండటంతో లింగం పోలీసులను ఆశ్రయించడంతో కేసు నమోదు చేశారు. నిందితులను పట్టుకునేందుకు సీఐ సురేశ్‌బాబు ఆధ్వర్యంలో రెండు బృందాలు ఏర్పాటై గాలింపు చర్యలు చేపట్టారు. మంగళవారం తిలక్‌రోడ్డులో ఓ ఇంట్లో కొందరు వ్యక్తులు నకిలీ నోట్లు సరఫరా చేసేందుకు సమావేశమయ్యారని సమాచారం రావడంతో సీఐ, ఎస్సై శ్రీకాంత్ సిబ్బందితో వెళ్లి అయిదుగురు వ్యక్తులను పట్టుకున్నారు. ఇందులో ఓ వ్యక్తి రాజస్థాన్ నుంచి రూ.2 లక్షల నకిలీ రూ.500 నోట్లను తీసుకొచ్చి ఇక్కడి నలుగురు వ్యక్తులతో చెలామణి చేయించాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఇందులో ఓ వ్యక్తి కొబ్బరి బోండాలు అమ్మే వ్యక్తికి, మరోవ్యక్తి రొట్టెలు అమ్మే వ్యక్తికి రూ.500 నోట్లను ఇచ్చినట్లు ఒప్పుకొన్నారు. అయిదుగురు నిందితులను అరెస్టు చేసి వారి వద్ద రూ.1,61,000ల విలువ గల రూ.500 నోట్లు, అయిదు చరవాణులను స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ పేర్కొన్నారు. సీఐ, ఎస్సై, సిబ్బందిని జిల్లా ఎస్పీ అభినందించినట్లు పేర్కొన్నారు.

బతుకమ్మ ఆడుతూ మహిళ హఠాన్మరణం



స్వరూప

ముత్తారం: ముత్తారం మండలం లక్కారంలో బుధవారం బతుకమ్మ వేడుకల్లో విషాదం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన మాదాసి స్వరూప(45) సాయంత్రం బతుకమ్మ ఆడుతూ కుప్పకూలింది. స్థానికులు గమనించి చూసేసరికే మృతి చెందింది. స్వరూప మెదడుకు సంబంధించిన వ్యాధితో బాధ పడుతున్నట్లు గ్రామస్థులు తెలిపారు. మృతురాలి భర్త పదేళ్ల కిందటే మృతి చెందగా ఇద్దరు కూతుళ్లకు పెళ్లిళ్లయ్యాయి. పండుగ రోజు మహిళ మృతితో గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి.

పెళ్లి కావడం లేదని ఎక్సైజ్ కానిస్టేబుల్ ఆత్మహత్య



దేవేందర్‌రెడ్డి

వీణవంక, న్యూస్‌టుడే : కరీంనగర్ జిల్లా వీణవంక మండలం ఎలబాక గ్రామానికి చెందిన ఎక్సైజ్ కానిస్టేబుల్ బొల్లం దేవేందర్‌రెడ్డి (27) పెళ్లి కాదేమోనన్న మనస్తాపంతో బలవన్మరణానికి పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. వీణవంక ఎస్సై తోట తిరుపతి కథనం ప్రకారం.. దేవేందర్‌రెడ్డికి ఇటీవల ఎక్సైజ్ కానిస్టేబుల్ ఉద్యోగం రాగా, నాలుగు నెలల నుంచి హుజూరాబాద్ ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్‌లో పని చేస్తున్నారు. ఈ నెల 1న మంగళవారం రాత్రి ఇంటి వద్ద పురుగు మందు తాగగా బంధువులు కరీంనగర్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం ఉదయం మృతి చెందారు. తన కుమారుడికి పెళ్లి సంబంధాలు చూస్తున్నా కుదరడం లేదని.. దీంతో మనస్తాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడినట్లు దేవేందర్‌రెడ్డి తండ్రి సంపత్‌రెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

వైకల్యాన్ని జయించి మూడు ఉద్యోగాలకు ఎంపిక



మధు

జగిత్యాల, న్యూస్‌టుడే: ఓ వైపు పేదరికం.. మరోవైపు అంగవైకల్యం అయినప్పటికీ లక్ష్యం కోసం వెనుతిరిగి చూడకుండా మూడు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించాడు. జగిత్యాల టాకావీధికి చెందిన అనుమల్ల మధు తండ్రి సత్యనారాయణతో పాటు ఓ వస్త్ర దుకాణంలో సేల్స్‌మెన్‌గా పనిచేసేవారు. గతంలో రహదారి ప్రమాదం జరగగా ఎడమకాలు మోకీలు వరకు తొలగించారు. ఆర్థిక ఇబ్బందులకు తోడు అంగవైకల్యం వెక్కిరిస్తున్నా పదో తరగతి చదివి ఆపేసి వస్త్ర దుకాణంలో పనిచేస్తూనే దూరవిద్య ద్వారా బీఏ, ఎంఏ, బీఈడీ పూర్తి చేశాడు. పోటీ పరీక్షలకు సిద్ధమవుతుండగా మొదటి ప్రయత్నంలో రెండు నెలల కిందట గురుకుల పాఠశాల ఉపాధ్యాయుడిగా ఎంపికై నిర్మల్ జిల్లా ఖానాపూర్‌లో పనిచేస్తున్నాడు. గతనెలలో వసతి గృహ సంక్షేమాధికారి ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో 5వ ర్యాంకు రాగా జోనల్‌స్థాయిలో మొదటి స్థానంలో నిలిచాడు. తాజాగా డీఎస్సీ ఫలితాలు ప్రకటించగా స్పెషల్ ఎడ్యుకేషన్ విభాగంలో జిల్లా స్థాయిలో మొదటిర్యాంకు సాధించాడు. గురువారం ధ్రువపత్రాలు పరిశీలించనున్నారు.

ఎస్సారెస్పీ నుంచి మధ్యమానేరుకు 12 వేల క్యూసెక్కులు

జగిత్యాల ధరూర్‌క్యాంపు, న్యూస్‌టుడే: శ్రీరామసాగర్ జలాశయం నుంచి బుధవారం సాయంత్రం వరకు వరదకాలువకు 12 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తూ మధ్యమానేరు జలాశయానికి తరలిస్తున్నారు. ఎస్సారెస్పీలోకి ప్రస్తుతం 17,860 క్యూసెక్కుల వరద వస్తుండగా స్పిల్‌వే గేట్లను మూసివేశారు. ప్రాజెక్టులో గరిష్ఠస్థాయిలో నీటినిల్వ 80.501 టీఎంసీలుగా ఉంది.

భత్యమివ్వండి.. బతకనివ్వండి

ప్రభుత్వ సాయానికి దివ్యాంగుడి ఎదురుచూపు

ఈనాడు, పెద్దపల్లి



తల్లితో కలిసి కలెక్టరేట్ ప్రజావాణికి వచ్చిన మహేశ్ (పాతచిత్రం)

తీవ్ర అనారోగ్యంతో ఆ యువకుడు మంచానికే పరిమితమయ్యారు.. ప్రభుత్వం అందించే పింఛను వైద్యం ఖర్చులకే సరిపోవడం లేదు.. చట్టం ప్రకారం అందాల్సిన సంరక్షకుడి భత్యం ఇవ్వాలని, లేకుంటే కారుణ్య మరణానికి అనుమతించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు..

పెద్దపల్లి జిల్లా మంథని మండలం బెస్తపల్లికి చెందిన తోకల మహేశ్‌కుమార్ వయసు 36 ఏళ్లు. చిన్నతనంలోనే తండ్రి చనిపోయారు. డిగ్రీ పూర్తి చేసిన మహేశ్ 15 ఏళ్ల కిందట జన్యుపరమైన కండరాల క్షీణత(మస్క్యులర్ డిస్ట్రోఫీ) వ్యాధి బారిన పడ్డారు. అప్పటి నుంచి ఆరోగ్యం క్రమంగా క్షీణిస్తోంది. ప్రభుత్వం అతడికి ఇచ్చే దివ్యాంగుల పింఛను రూ.4,016, తల్లికి వచ్చే వితంతు పింఛను రూ.2,016 మాత్రమే జీవనాధారం. ఆ మొత్తం వైద్య ఖర్చులకూ సరిపోవడం లేదు. కండరాలన్నీ చచ్చుబడి మంచానికే పరిమితం కావడంతో వృద్ధురాలైన తల్లి మల్లమ్మనే అన్ని పనులూ చేస్తున్నారు. ఆమె తరచూ అనారోగ్యం బారిన పడుతుండటంతో తనకు 'కారుణ్య మరణం' ప్రసాదించాలంటూ మహేశ్ ఈ ఏడాది జనవరి 18న మానవ హక్కుల కమిషన్‌కు లేఖ రాశారు. ఇప్పటివరకు స్పందన లేకపోవడంతో దివ్యాంగుల హక్కుల చట్టం(ఆర్‌పీడబ్ల్యూడీ) 2016 ప్రకారం తనకు సంరక్షకుడి భత్యం(కేర్ టేకర్ అలవెన్స్) మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు. అలా ఇవ్వని పక్షంలో కారుణ్య మరణమైనా ప్రసాదించాలని విన్నవిస్తున్నారు.

ఈనాడు కథనాలతో గూడు

కాళేశ్వరం ప్రాజెక్టులోని పార్వతీ(సుందిళ్ల) బ్యారేజీ వెనుక జలాల్లో బెస్తపల్లి గ్రామం ముంపునకు గురైంది. మహేశ్ దుస్థితిపై పలుమార్లు 'ఈనాడు'లో కథనాలు రావడంతో అధికారులు స్పందించి మంథని పోచమ్మవాడలోని రెండు పడక గదుల గృహ సముదాయంలో ఇంటిని కేటాయించారు. ఆ తర్వాత జీవనోపాధికి సాయం అందించాలంటూ పలుమార్లు కలెక్టరేట్‌లోని 'ప్రజావాణి'ని ఆశ్రయించినా ఫలితం లేకపోయింది. తనలాగా రాష్ట్రవ్యాప్తంగా 2 వేల మంది కండర క్షీణత వ్యాధితో బాధ పడుతున్నందున ప్రభుత్వం అండగా నిలవాలని మహేశ్‌కుమార్ కోరుతున్నారు. పింఛను మొత్తాన్ని పెంచాలని, సంరక్షకుడి భత్యాన్ని మంజూరు చేయాలని వేడుకుంటున్నారు. ఈ విషయమై కలెక్టర్ కోయ శ్రీహర్షను 'ఈనాడు' సంప్రదించగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.

హక్కులపై అన్నదాత ఆశలు

సాదాబైనామా కింద 1.12 లక్షల దరఖాస్తులు ■ ఆర్వోఆర్ చట్టంతో తొలగనున్న ఇబ్బందులు

ధరణి పోర్టల్‌లోని సాంకేతిక సమస్యలతో పాటు సాదాబైనామా దరఖాస్తుల పరిష్కారానికి మోక్షం లభించనుంది. ఆర్వోఆర్ చట్టాన్ని అందుబాటులోకి తీసుకొచ్చి రైతులకు హక్కులకు కల్పించేందుకు ప్రభుత్వం కొత్త రెవెన్యూ చట్టాన్ని సిద్ధం చేస్తోంది. పెండింగ్ భూ సమస్యలతో పాటు తెల్ల కాగితంపై రాసుకున్న దస్త్రాలకు పట్టా హక్కులు కల్పించనుంది. కొన్నేళ్లుగా కార్యాలయాల చుట్టూ తిరుగుతున్న రైతులకు భూ యాజమాన్య హక్కుల కష్టాలు దూరం కానున్నాయి. – న్యూస్‌టుడే, పెద్దపల్లి



పెద్దపల్లి కలెక్టరేట్‌లోని ధరణి విభాగంలో ఫిర్యాదు చేస్తున్న రైతులు

మూడేళ్ల కిందట స్వీకరణ

తెల్ల కాగితంపై క్రయ విక్రయాలు సాగించిన భూములకు గత ప్రభుత్వం 2021లో మీసేవ ద్వారా సాదాబైనామాలో దరఖాస్తులు ఆహ్వానించగా ఉమ్మడి జిల్లాలో 1,12,517 మంది చేసుకున్నారు. తెల్లకాగితంపై రాసుకున్న భూ క్రయ విక్రయాలకు చట్టబద్ధత కల్పించడానికి రిజిస్ట్రేషన్లు చేసి పట్టా పాసుపుస్తకాలు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. పాత రెవెన్యూ చట్టం రద్దయ్యాక దాని ఆధారంగా చేపట్టే సాదాబైనామాల క్రమబద్ధీకరణ ప్రక్రియను నిలిపివేయాలని హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయడంతో ఆ ప్రక్రియ నిలిచిపోయింది.

ఉమ్మడి జిల్లాలో దరఖాస్తులు

పెద్దపల్లి:	35,580
రాజన్న సిరిసిల్ల:	15,056
కరీంనగర్:	26,871
జగిత్యాల:	35,010

పథకాలకు దూరం

గతంలో తెల్ల కాగితాలపై రాసుకొని కొనుగోలు చేసిన భూములకు పట్టాదారు పాసుపుస్తకాలు లేకపోవడంతో రైతులు వివిధ అవసరాలకు ఇబ్బందులు పడుతున్నారు. రైతుబంధు, రైతు బీమా, కిసాన్ సమ్మాన్ నిధి, పంట రుణం, ఇతర సంక్షేమ పథకాలకు దూరమవుతున్నారు. కళ్ల ముందే భూమి ఉన్నా పట్టా హక్కులు లేకపోవడంతో ఏమీ చేయలేని పరిస్థితి. మరోవైపు ధరణి పోర్టల్‌లో అమ్మిన రైతుల పేర్లే కనిపించడంతో కొనుగోలుదారులకు కొత్త చిక్కులు ఎదురవుతున్నాయి. భూములు విక్రయించిన వారసులు ఎదురు తిరుగుతూ న్యాయస్థానాన్ని ఆశ్రయించడం తలనొప్పిగా మారింది.

ఆ నిబంధన తొలగిస్తేనే ప్రయోజనం

కొత్త చట్టం సాదాబైనామాలకు అవకాశం కల్పించడంతో అన్నదాతల్లో ఆశలు చిగురిస్తున్నాయి. గతంలో మాదిరిగానే నిర్దేశిత రుసుం లేకుండా పట్టాదారు పాసు పుస్తకాలను జారీ చేసేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. 'భూ యజమానుల వారసుల అంగీకారం' అనే నిబంధనను తొలగించాలని పలువురు రైతులు అభిప్రాయపడుతున్నారు. ఆ నిబంధన అమలు చేస్తే సాదాబైనామాల వల్ల కలిగే ప్రయోజనం అంతంతమాత్రమేనని విశ్రాంత రెవెన్యూ ఉద్యోగులు పేర్కొంటున్నారు.

పరిచయస్థురాలే కాజేసింది

బంగారం చోరీ కేసు ఛేదించిన పోలీసులు



నిందితుల అరెస్టు చూపుతున్న ఏసీపీలు నరేందర్, కాశయ్య

కరీంనగర్ నేరవార్తలు, న్యూస్‌టుడే: తనకు పరిచయం ఉన్న వివాహిత ఒంటిపై కనిపించిన బంగారు ఆభరణలపై కన్నేసింది. ఎలాగైనా వాటిని దక్కించుకోవాలని పన్నాగం పన్నింది. బంధువుతో కలిసి చోరీకి పాల్పడి చివరకు పోలీసులకు చిక్కింది. కరీంనగర్ నగర ఏసీపీ జి.నరేందర్ బుధవారం వెల్లడించిన వివరాల ప్రకారం.. పిట్టల ప్రశాంత్ (గ్రానైట్ వ్యాపారి), భార్య లహరి (గృహిణి)లు కరీంనగర్ ప్రగతినగర్‌లో ఉంటున్నారు. సెప్టెంబర్ 24 మధ్యాహ్నం లహరి బయటకు వెళ్లి రాగా ఇంటికి మరోవైపు ఉన్న తలుపు తీసి ఉంది. బీరువాలోని 187 గ్రాముల బంగారు ఆభరణాలు కనిపించలేదు. బాధితురాలి ఫిర్యాదు మేరకు ఏసీపీ నరేందర్, సీఐ విజయ్‌కుమార్‌లు కేసు దర్యాప్తు చేపట్టారు. సీసీఎస్, రెండో ఠాణా పోలీసులు సాంకేతిక పరిజ్ఞానంతో నిందితులను గుర్తించారు. బాధితురాలు లహరి, నిందితురాలు త్రిపురాని లహరి అలియాస్ శిరీష గతంలో రాంనగర్‌లో పక్కపక్కనే అద్దెకు ఉన్నారు. లహరి మరో ఇల్లు మారినా.. శిరీష వెళ్లి పలకరిస్తుండేది. గణేశ్ నవరాత్రుల సందర్భంగా లహరి ఒంటిపై బంగారు ఆభరణాలను గమనించిన శిరీష.. ఎలాగైనా వాటిని దక్కించుకోవాలనుకుంది. చోరీ జరిగే ముందు రోజు లహరి ఇంటికి వెళ్లి ప్రధాన ద్వారం కాకుండా పక్కన ఉండే మరో ద్వారం బేడం తీసి వచ్చింది. ఎప్పుడు ఆ ద్వారంను ఉపయోగించకపోవడంతో బాధిత కుటుంబ సభ్యులు దృష్టి సారించలేకపోయారు. 24న ఇంట్లో ఎవరూ లేని సమయంలో శిరీష మంచిర్యాల జిల్లా భీమారం మండలం ఖాజీపూర్‌కు చెందిన తన మేనబావ చిలుకాని రాజశేఖర్‌తో కలిసి ఇంట్లోకి చొరబడి బంగారాన్ని అపహరించింది. సీసీ కెమెరాల ద్వారా నిందితులను గుర్తించిన పోలీసులు వారిని కరీంనగర్ తెలంగాణచౌక్ వద్ద పట్టుకున్నారు. 187 గ్రాముల బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకొని ఇద్దరినీ జైలుకు పంపించినట్లు ఏసీపీ తెలిపారు. సీసీఎస్ ఏసీపీ కాశయ్య ఉన్నారు.

క్షణికావేశం అన్న ప్రాణం తీసింది!

■ కుమారుడిని చంపుతాననడంతో తమ్ముడి దాడి?

■ అంతర్గాం హత్యోదంతంపై పోలీసులకు స్పష్టత

జగిత్యాల గ్రామీణం, న్యూస్‌టుడే : జగిత్యాల మండలం అంతర్గాంలో మంగళవారం రాత్రి హత్యకు గురైన విద్యాసాగర్‌రాజు కేసులో పోలీసులు పురోగతి సాధించినట్లు తెలిసింది. మృతుడి సోదరుడిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించగా తన కుమారుడిని చంపుతానని బెదిరించడంతో క్షణికావేశంలో హత్య చేసినట్లు ఒప్పుకొన్నట్లు సమాచారం.. విశ్వసనీయ సమాచారం మేరకు.. అంతర్గాంకు చెందిన నన్నపనేని రమేశ్‌రాజు దంపతులకు విద్యాసాగర్‌రాజు, విక్రమ్‌రాజు ఇద్దరు కుమారులు. వీరిది ఉమ్మడి కుటుంబం కాగా పెద్ద కుమారుడు పదేళ్ల కిందట దుబాయికి వెళ్లాడు. అక్కడ మద్యానికి బానిసై అప్పులు చేయగా అతడికి రూ.5 లక్షలు పంపించడంతోపాటు భూమి అమ్మి మరో రూ.20 లక్షలకుపైగా అప్పులు చెల్లించారు. మూడేళ్ల కిందట స్వగ్రామానికి వచ్చిన విద్యాసాగర్‌రాజును కుటుంబ సభ్యులు పెళ్లి చేసుకోవాలని సూచించినా నిరాకరించాడు. విక్రమ్‌రాజుకు వివాహం కాగా ఒక బాబు జన్మించాడు. విద్యాసాగర్ రాజు మద్యానికి బానిసై నిత్యం డబ్బుల కోసం తండ్రిని అడగటం ఇవ్వకపోతే చంపుతానని బెదిరించటం అలవాటు చేసుకున్నాడు. ఈ క్రమంలో ఆదివారం తల్లిదండ్రులపై దాడి చేసి చంపుతానని బెదిరించటంతో వారు ఇంట్లో నుంచి వెళ్లిపోయారు. మంగళవారం సాయంత్రం ఇంట్లో ఒంటరిగా ఉన్న తమ్ముడితో అన్న గొడవకు దిగాడు. అమ్మానాన్నను ఎక్కడ దాచావంటూ బెదిరించాడు. భూమి అమ్మి డబ్బులు ఇవ్వాలని బెదిరించి తీవ్ర వాగ్వాదానికి దిగాడు. తమ్ముడిని, అతడి కుమారుడిని కూడా చంపుతానని బెదిరించాడు. దీంతో విక్రమ్‌రాజు విద్యాసాగర్‌రాజు తలపై రోకలి బండతో కొట్టడంతో మృతి చెందినట్లు పోలీసుల విచారణలో వెల్లడించినట్లు తెలిసింది. కుమారుడి హత్య గురించి తెలుసుకుని తల్లిదండ్రులు బుధవారం ఇంటికి చేరారు. కేసును జగిత్యాల డీఎస్పీ రఘుచందర్, సీఐ కృష్ణారెడ్డి, ఎస్సై సదాకర్ దర్యాప్తు చేస్తున్నారు. సీఐ కృష్ణారెడ్డిని హత్య కేసు విషయమై వివరణ కోరగా గురువారం విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడిస్తామన్నారు.

నవోదయలో ప్రవేశానికి గడువు పొడిగింపు

చొప్పదండి : నవోదయ పాఠశాలలో ఆరో తరగతి ప్రవేశానికి దరఖాస్తు గడువు ఈ నెల 7 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించినట్లు ప్రిన్సిపల్ మంగతాయారు ఓ ప్రకటనలో తెలిపారు. 8, 9 తేదీల్లో దరఖాస్తుల్లోని పొరపాట్లు సవరించుకునే అవకాశం ఉందని పేర్కొన్నారు. విద్యార్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు.